

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**AUGUST - 2017**

సంవత్సర చందా రూ. 50/-

# సంక్షిప్త వార్తలు

2017 జూన్ 27వ తేదీన అమెరికా నుండి 10 మంది యువకులు రిక్కీ గారితో కలసి పనిచేయుటకు కాకినాడ చేరుకొనిరి. వచ్చినవారందరు కాలేజీ విద్యార్థులే, అయినను సువార్తయందు ఆసక్తిగల యువకులు. వారితో కలసి రిక్కీ గారు కె. వెంకటాపురం, గాలిపాడు, గొడుగుమామిడి, నర్సీపట్నం, విప్పలపాలెం, తాండవ, బి.కె.పల్లి, నేరెళ్లబంద, కొవ్వాడ, మల్లవరం, కొలపరి, దొడ్డవరం గ్రామాలలో సువార్తచేసిరి. ఆయా ప్రాంతాలలో ఆరుగురు క్రీస్తులోనికి బాప్తిస్మముపొందిరి.

తదుపరి పై బృందముతో కలసి రిక్కీగారు, పాచిపెంట, సాలూరు, క్రొత్తవలస, బొబ్బిలి, ఒరిస్సా మొదలగు గ్రామములు దర్శించిరి. ఈ ప్రాంతములలో సోదరులు థామస్ జాన్సన్ గూటం గారు అనేక సంవత్సరముల నుండి సత్యవాక్యమును బోధించుచున్నారు. తత్ఫలితముగా అసంఖ్యాకమైన మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

2017 జూలై 8వ తేదీనాడు ముమ్మిడివరం మండలం, మట్లాదిపాలెం గ్రామములో జరిగిన సువార్త కూటములో రోనీగూటం గారు రోమీయులకు వ్రాయబడిన పత్రికనుగూర్చిన వివరణఇస్తూ గొప్ప ప్రసంగము చేసిరి. అనేకులు ఆయన వాక్యజ్ఞానమునకు ఆశ్చర్యపడి ప్రభువును స్తుతించిరి. అక్కడ సత్యేశ్వరరావు గారు వాక్యపరిచర్య చేయుచున్నారు. 10వ తేదీ సోమవారం ముమ్మిడివరం మండలం పోతుకూరులోయున్న సంఘము స్తుతికూటము నేర్పాటుచేసి ప్రభువును స్తుతించిరి. పోతుకూరులో వై. ప్రభాకర్‌రావ్ గారు సువార్త పనిచేయుచున్నారు.

2017 జూలై 14వ తేదీ శుక్రవారం మెంఫిస్ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌లో హెబ్రీ, గ్రీకు భాషల పండితుడును ప్రొఫెసర్ డేనియల్‌కేట్స్ గారు కాకినాడ చేరుకొని 17, 18 తేదీలలో బోధకులకు సత్యవాణిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక

(మిగతా 23వ పేజీలో)

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

సంపుటి - 39 ఆగష్టు - 2017 సంచిక -1


## సబ్బాతును ఎవరు మార్చిరి ?

### ( Who Changed the Sabbath? )

గత మా సంచికలో శనివారమే సబ్బాతు దినమనియు దానిని దేవుడు ఇశ్రాయేలీయులకు తప్ప మరెవరికిని ఇయ్యలేదనియు తెలిసికొన్నాము. ఈనాడు సబ్బాతు నిలిచియున్నదని బోధించువారే సబ్బాతును ఆచరించుట లేదనికూడ తెలిసికొన్నాము.

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 8:8-13 వరకు మనము చూచిన యెడల మోషే ధర్మశాస్త్రమును, దాని యందున్న ఆజ్ఞలును త్రోసివేయ బడునని ముందుగనే యెహోవా దేవుడు ప్రవచించెను. "ప్రభువు ఇట్లనెను. ఇదిగో యొక కాలము వచ్చుచున్నది. అప్పటిలో ఇశ్రాయేలు వారితోను యూదా ఇంటివారితోను నేను క్రొత్తనిబంధన చేయుదును. అది నేను ఐగుప్తుదేశములో నుండి వీరి పితరులను వెలుపలికి రప్పించుటకై వారిని చెయ్యిపట్టుకొనిన దినమున వారితో నేను చేసిన నిబంధన వంటిది కాదు". యిర్మీయా 31:31-33లో యున్న ప్రవచనమును అపొ.పౌలు ఇక్కడ ఎత్తిచూపించి ప్రభువు ఒక క్రొత్త నిబంధనను చేయుదునని చెప్పిన మాటను మనకు జ్ఞప్తి తెచ్చుచున్నాడు. హెబ్రీ 8:13లో "ఆయన క్రొత్త నిబంధన అని చెప్పుటచేత మొదటిది

పాతదిగా చేసియున్నాడు. ఏది పాతగిలి ఉడిగిపోవునో అది అదృశ్యమగుటకు సిద్ధముగా ఉన్నది" యని పౌలు వ్రాసెను.

ఇప్పుడు పాతనిబంధనకు బదులు క్రొత్త నిబంధన ఇయ్యబడి యున్నది. సబ్బాతు దినమగు శనివారమునకు బదులు ప్రభువు దినమగు ఆదివారము అనగా వారములో మొదటి దినము ఆరాధన దినముగా ఇయ్యబడియున్నది. యేసుక్రీస్తు యొక్క మరణమువలన పది ఆజ్ఞలతో కూడిన పాతనిబంధన అమలులో లేకుండ కొట్టివేయబడినది. "కొట్టివేయబడు మహిమయొక్క అంతమును ఇశ్రాయేలీయులు తేరి చూడకుండునట్లు మోషే తన ముఖము మీద ముసుగు వేసుకొనెను... మరియు వారి మనస్సులు కఠినము లాయెను గనుక నేటివరకును పాత నిబంధన చదువబడునప్పుడు అది క్రీస్తునందు కొట్టివేయబడెనని వారికి తేటపరచబడక, ఆ ముసుగే నిలిచి యున్నది"యని 2 కొరింధీ 3:12-14 లో వ్రాయబడియున్నది. మరల "దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞవలన మనమీద ఋణముగాను మనకు విరోధముగాను ఉండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి, దానిమీద చేవ్రాతను తుడిచివేసి మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసెను" అని కొలస్స 2:14లో వ్రాయబడి యున్నది.

పాతనిబంధన కాలములోనే యెషయా 1:13 ప్రకారము సబ్బాతు దినము దేవునికి అసహ్యము పుట్టించెను. అందువలన "దాని ఉత్సవ కాలములను, పండుగలను, అమావాస్యలను, విశ్రాంతి దినములను, నియామక కాలములను మాన్పింతును" అని హోషేయ 2:11లో ప్రభువు పలికెను. యేసుక్రీస్తు పునరుత్థానుడై పరలోకమునకు వెళ్ళి దేవుని ప్రధాన యాజకుడాయెను. యాజకుడు మార్చబడినందున యాజకధర్మము సహామార్చబడెను (హెబ్రీ 7:12). యేసుక్రీస్తు సబ్బాతు దినమునకు ప్రభువై యున్నందున ఆయన పాత చట్టమును మార్చగలిగెను (మార్కు 2: 23-28). ఆయన దానిని తీసివేసెను. మనమిక మోషే ధర్మశాస్త్రమందుగాక క్రీస్తుద్వారా కలిగిన కృపయందున్నాము (యోహాను 1:17).

యేసుగాని, అపొస్తులులుగాని

సబ్బాతు నాచరించవలెనని సంఘమును హెచ్చరించలేదు. పాత నిబంధనలోని పది ఆజ్ఞలలో విశ్రాంతి దినమును గూర్చిన ఆజ్ఞ తప్ప మిగిలిన తొమ్మిది ఆజ్ఞల సూత్రములు క్రొత్త నిబంధనలో ఇమడ్చబడి యున్నవి. యేసుక్రీస్తును, ఆయన అపొస్తులులును వీటిని బోధించిరి గనుక అవి క్రొత్త నిబంధనలో ఒక భాగమైయున్నవి. ప్రజలను క్రీస్తునొద్దకు తెచ్చుటలో పాత నిబంధన యొక్క ప్రయోజనము నెరవేర్చబడెను. క్రీస్తు వెల్లడియాయెను గనుక ఇకను ధర్మశాస్త్రము యొక్క ప్రయోజనము లేదు (గలతీ 3:16-29).

ఆదిమ క్రైస్తవులు వారములో ఆఖరిదినమున కాక మొదటి దినమందు దేవుని ఆరాధించుటకు కూడుకొనుచుండిరి. "ఆదివారమున మేము రొట్టె విరుచుటకు (అంటే ఆరాధనకు) కూడినప్పుడు పౌలు మరునాడు వెళ్ళనైయుండి, వారితో ప్రసంగించుచు అర్ధరాత్రి వరకు విస్తరించి మాటలాడుచుండెను" అని అపొ.కా. 20:7లో వ్రాయబడియున్నది. ఆదిమ క్రైస్తవులు దేవుని ఆరాధించుటకు కూడి వచ్చినప్పుడు చందా నిచ్చిరి. అది ఆదివార దినము అని 1 కొరింథి 16:1,2లో వ్రాయబడి యున్నది. యేసుప్రభువు ఆదివారమున మృతులలో నుండి లేచెను (మార్కు 16:1-6). క్రీస్తు సంఘము పెంతెకోస్తు దినమున స్థాపించబడెను. అది ఆదివారము (అపొ.కా. 2). వారములో మొదటి దినమే ప్రభువు దినము. దానిని సబ్బాతు అని మనము పిలువరాదు (ప్రకటన 1:10).

యేసుప్రభువు ఆదివారమున మృతులలో నుండి పునరుత్థానుడై నందున ఆ దినమునకు గొప్ప ప్రాముఖ్యత కలిగియున్నది. అది దేవునిచే నియమించబడిన దినము. యేసు మరణమును జయించి విజేయుడై లేచిన దినము అది. ఆయన సమాధి నుండి లేచిన తరువాత ఆదివారమున తన శిష్యులకు తన్ను తాను కనబరచు కొనెను (యోహాను 20:1,19,26). ఆయన పరమునకు ఆరోహణుడైన తరువాత తన శిష్యులను సర్వసత్యము లోనికి నడిపించుటకు పరిశుద్ధాత్ముని పంపిన దినమది. అది ఆదివారము.

క్రైస్తవులు ఆచరించు నిమిత్తము క్రీస్తు ప్రభురాత్రి భోజనము నెల కొల్పెను.

ప్రభురాత్రి భోజనము చేయునప్పుడెల్ల వారు ఆయన వచ్చు పర్యంతము ఆయన మరణమును ప్రచురించుదురు. దానిని చేయుటకు ప్రభువు దినమైన ఆదివారముకంటె మిన్నయైన దినము వేరొకటి యేమున్నది?

ఆదివారమును ప్రభువు నారాధించు దినముగా మార్చుటలో క్రైస్తవుల ఆత్మీయ పెరుగుదల, క్షేమాభివృద్ధి ఇమిడియున్నవి. ఒక సందర్భములో యేసు "విశ్రాంతి దినము మనుష్యులకొరకే గాని మనుష్యులు విశ్రాంతిదినము కొరకు నియమింపబడలేదు" అని చెప్పెను (మార్కు 2:27). దీనిని బట్టి సబ్బాతు అమలులో యున్నంతకాలము అది మానవుల క్షేమము నిమిత్తము ఇయ్యబడెనని మనకు అర్ధమగుచున్నది. ఆ దినమునుబట్టి మానవులు అత్యున్నత అభ్యుదయమును సాధించ వలసినది. ఇశ్రాయేలీయులు ఐగుప్తు బానిసత్వము నుండి పొందిన విడుదలను జ్ఞాపకము చేసికొనుచు విశ్రాంతిదినము నెట్లు ఆచరించేవారో అట్లే నేడు ప్రపంచమందంతటాయున్న నిజక్రైస్తవులు పాపము నుండి క్రీస్తు ద్వారా తమకు కలిగిన విమోచనను ప్రతి ఆదివారమున జ్ఞాపకము చేసి కొందురు. అందువలననే "కొందరు మానుకొనుచున్నట్టుగా సమాజముగా కూడుట మానక ఒకనినొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరు చూచినకొలది మరి యెక్కువగా ఆలాగుచేయుచు, ప్రేమ చూపుటకును, సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్ప వలెనని" అపొ.పౌలు పరిశుద్ధాత్ముని ప్రేరణతో క్రైస్తవులను హెచ్చరించు చున్నాడు (హెబ్రీ 10:24,25).

ఆరాధన దినమును శనివారము నుండి ఆదివారమునకు మార్చిన దెవరు? దానిని ఏ మానవులు మార్చలేదు. కేథలిక్కు సంఘముగాని, మరే సంఘముగాని దానిని మార్చలేదు. దేవుడే దానినిమార్చెను. యేసుక్రీస్తు చనిపోయి సమాధి నుండి తిరిగి లేచిన తరువాత క్రైస్తవులకు ఆదివారమును దేవుడు ఆరాధన దినముగా నియమించెను. మొదటి క్రైస్తవులు యూదా మతములో నుండి క్రైస్తవులుగా మారిన వారు గనుక సబ్బాతును గూర్చి ఏమైనా బాధ

ఉంటే వారికి ఉండవలసినది. గాని వారిలో ఏ ఒక్కడు అపొస్తులుల బోధను ప్రశ్నించినవారు లేడు. దేవుని చిత్తమునకు నిజక్రైస్తవులెవరు ఎదురు తిరుగరు కూడ.

ఇప్పుడు అమలులోయున్నది క్రీస్తు చట్టము. మనము దేవుని ఆరాధించవలసిన దినము శనివారము కాదుగాని ఆదివారము. నీవు యూదుడవైనను అన్యుడవైనను సరే సబ్బాతుతో నీకిప్పుడు సంబంధము లేదు. గాని క్రీస్తుతో నీవు సంబంధమును, సమాధానమును కలిగి యుండవలెనంటే యేసే దేవుని కుమారుడని నమ్ముకొనుము. పాపముల విషయమై మారుమనస్సు నొందుము. పాప క్షమాపణ నిమిత్తము నీటిలో క్రీస్తు నామమును బట్టి ముంచడము బొందుము. ప్రతి దినము, ప్రతి ఆదివారము క్రీస్తు సంఘముతో కూడి దేవుని సేవింపుము. అప్పుడు సకలానందము నీదగును!!

## వారములో మొదటి దినము

## (The First Day of The Week)

ప్రతి వారములోను ఏడు దినములున్నవి. అయితే దేవుని ఏ దినమున క్రైస్తవుడు ఆరాధించవలెను? ఏదైనా ఒక దినము ఆరాధన దినముగ ప్రత్యేకింపబడెనా? బైబిలు ఏమి బోధించుచున్నది?

ధర్మశాస్త్ర ప్రకారము యూదుల ఆరాధన దినము సబ్బాతు దినమై యుండెనని మనమందరము ఎరుగుదుము. ఇతర మతములలో చూచిన ముస్లిములు శుక్రవారము నను, బౌద్ధులు "పోయా" దినమునను ఆరాధించెదరు. అయితే క్రైస్తవుల సంగతియేమి? ఆరాధన చేయు దినము ఏదైనను సరియైనదేనా?

మనలో అనేకులు యూదుల చట్టబద్ధమైన సబ్బాతు దినము ఇంకను అమలులో నున్నదని చెప్పుదురు. అయితే అది యూదులకు మాత్రమే ఇయ్యబడెనని గమనించుము (నిర్గమ 20:1-17). మనకు ఇయ్యబడిన ధర్మశాస్త్రము కంటె అది వేరైనది అది నెరవేర్చబడినది, తొలగించబడినది (యోహాను 1:17; మత్తయి 5:17-19).

క్రీస్తు సబ్బాతు నాచరించెను. ఏలయనగా ఆయన వేరొక చట్టము క్రింద జీవించి మరణించెను. ఆ దినమును ఆచరించవలసినదిగా క్రీస్తు ఒక్కసారి కూడ ఆజ్ఞయివ్వలేదని గుర్తుంచుకొనుట మంచిది. అపొస్తులులు కూడ దాని నాచరించలేదు, ఆజ్ఞాపించలేదు. పౌలు సబ్బాతు దినమున సమాజ మందిరములలో ప్రవేశించెను. గాని ఆరాధించుటకు వెళ్లలేదు. అయితే అతడు ఎందుకు వెళ్ళెను? దేవుని వాక్యమును బోధించుటకు. అతని ఉద్దేశమును యూదులు కనుగొనిన తరువాత, అతనికి యూదుల దేవాలయములలో ప్రవేశము లభించక పోయెను.

కేథలిక్కులు ఆరాధన దినమును మార్చివేసిరియని చెప్పువారు కొందరు ఉన్నారు. బైబిలును మేము యిచ్చితిమని కేథలిక్కులు ఆరోపించు కొందురు. అయితే ఈ రెండు అబద్ధమే. క్రీస్తు ధర్మశాస్త్రము క్రిందనున్న వారెన్నడును సబ్బాతును ఆచరించినట్లు బైబిలు ఎక్కడ బోధించుటలేదు. చరిత్ర కూడా అట్లు చెప్పుటలేదు.

సత్యవాక్యమును మనము సరిగ విభజింపగలిగి (2తిమోతి 2:15), మోషే ధర్మశాస్త్రమునకును, క్రీస్తు ధర్మశాస్త్రమునకును గల భేదమును గ్రహించినపుడు మోషే చట్టముతో కూడ సబ్బాతు దినము ఎత్తివేయబడెనని (2 కొరింథీ 3:6-16), క్రీస్తు చట్టము ఒక క్రొత్త దినమును అనగా ఆదివారమును ఆరాధన దినముగ ప్రవేశపెట్టెనని చూడగలము. అపొ.కా. 15:13-19 వరకు చదివిన యెడల అన్యజనులలో నుండి క్రైస్తవులయిన వారిని సబ్బాతు నుండియు, మోషే చట్టము నుండియు పరిశుద్ధాత్ముడు విడుదల చేసెనని గ్రహించగలవు.

ఆదివారమును గూర్చి, వాక్య ప్రకారము లేని అనేక అభిప్రాయములను నీవు పొందక ముందు కొన్ని సంగతులను చూపించగోరుచున్నాను. మొదటిది-వారములో మొదటి దినము క్రైస్తవ సబ్బాతు దినము కాదు. అది విశ్రాంతి దినము కాదు. ఆచరించవలసిన దినము కూడ కాదు. అది పరిశుద్ధ దినము కాదు, అయితే అదేమిటి? అది క్రైస్తవులు సమాజముగ కూడుకొని దేవుని నారాధించుటకు

ప్రత్యేక పరచబడిన ప్రభువు దినము. పాతనిబంధన సబ్బాతుతో దానికి ఏమియు పోలికలు లేవు.

ఆదివారమును గూర్చి వాక్యమేమి చెప్పుచున్నదో గమనించుము :

1. ఆదివారమును క్రీస్తు సమాధి నుండి లేచెను (మత్తయి 28:1-7). ఆయన పునరుత్థానుడైన తరువాత ఆదివారమున తన శిష్యులను రెండు సార్లు కలుసుకొనెను (యోహాను 20: 1,19,26).

2. పరిశుద్ధాత్ముడు పెంతెకోస్తు దినమున కుమ్మరింపబడెను. అది ఆదివారము (అపొ.కా. 2:1-4). అది మనకెట్లు తెలియును? ఏలయనగా పెంతెకోస్తు ఎల్లప్పుడు వారములో మొదటి దినముననే వచ్చెను.

3. మొట్టమొదటిగా సువార్త వారములో మొదటి దినమున ప్రకటించబడెను.

4. సంఘము ఆదివారమున స్థాపించబడెను (అపొ.కా. 2:38-47).

5. ఆదివారమున శిష్యులు రొట్టె విరుచుటకు కూడుకొనిరి.

"ఆదివారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు పౌలు మరునాడు వెళ్ళనైయుండి వారితో ప్రసంగించుచు అర్ధరాత్రి వరకు విస్తరించి మాటలాడుచుండెను" (అపొ.కా. 20:7).

6. ఆదివారమున క్రైస్తవులు కానుకల నీయవలెనని చెప్పబడెను. "పరిశుద్ధుల కొరకైన చందా విషయమైతే నేను గలతీయ సంఘములకు నియమించిన ప్రకారము మీరును చేయుడి. నేను వచ్చినప్పుడు చందా పోగుచేయకుండ ప్రతి ఆదివారము మీలో ప్రతివాడును తాను వర్ధిల్లిన కొలది తన యొద్ద కొంతసొమ్ము నిలువచేయవలెను" (1 కొరింథీ 16:1,2). ఇది బహిరంగ సమావేశము అని పౌలు చెప్పిన మాటలను బట్టి గ్రహింపగు చున్నది. ఆరాధన దినము సబ్బాతు దినమయిన యెడల పౌలు క్రైస్తవులను ఆదివారము కేవలము చందా నిచ్చుటకే ఎందుకు కూడుకొనవలెనని చెప్పెను? సబ్బాతు దినమును యింకను ఆచరించువారు పౌలు బోధను గ్రహింపకయున్నారా? అయితే ఎందుకు గ్రహింపక యున్నారు?

7. ఆ దినము సమీపించిన కొలది క్రైస్తవులు సమాజముగా కూడుకొనుట మానరాదు (హెబ్రీ

10:25). ఆ దినము ఆదివార దినము. యోహాను దానిని ప్రభువు దినమని చెప్పెను (ప్రకటన 1:10). అది ఆరాధన దినము, ప్రభువును వెనుక నుంచుట కంటె ముందునుంచు దినము.

ఇంకను పాతనిబంధన ననుసరించువారు రోమా7:1-7; 2 కొరింథీ 3వ అధ్యాయము, ఎఫెసీ 2; కొలస్స 2; హెబ్రీ 8:7-10లను జాగ్రత్తగా మరియొకసారి చదువవలెను. మనము మోషే ద్వారా కలిగిన ధర్మశాస్త్రము క్రిందలేము గాని క్రీస్తు ధర్మశాస్త్రము క్రిందయున్నామని గ్రహించవలెను. ఆయన చట్టప్రకారము ఉన్నట్టి దినమందు ఆయనను ఆరాధించెదము గాక. దానికంటె తక్కువైన దానిని ప్రభువు అంగీకరించరు.

-జె.సి.ఛోట్

## ఆసక్తి జనక వాస్తవములు

## ( Very Interesting Facts )

1. ఏదెను వనము ఇరాక్‌లో యుండెను.
2. ఇరాక్‌లో ఇప్పుడున్న మెసపొటొమియ పూర్వం నాగరికతకు కేంద్రం.
3. ఇరాక్‌లోనే నోవహు ఓడను నిర్మించెను.
4. బాబెలు గోపురము ఇరాక్‌లో యుండెను.
5. అబ్రాహాము కాపురమున్న కల్దీయుల ఊరు అను పట్టణము దక్షిణ ఇరాక్‌లో యున్నది (ఆది.కా.11:31).
6. ఇస్సాకు భార్యయైన రిబ్కా నాహోరు పట్టణస్థురాలు. అది ఇరాక్‌లో యున్నది (ఆది.కా.24:10).
7. యాకోబు రాహేలును ఇరాక్‌లో కలిసికొనెను.
8. యోనానీనెవెలో ప్రకటించెను.
9. ఆమోను ఇరాక్‌లో ప్రకటించెను.
10. ఇరాక్‌లోయున్న అష్షూరు ఇశ్రాయేలీయుల పది గోత్రములను జయించెను.
11. ఇరాక్‌లో యున్నబబులోను యెరూషలేమును నాశనము చేసెను.

12. దానియేలు ఇరాక్‌లో సింహపు బోనులో పడవేయబడెను.

13. షద్రకు, మేషెకు, అబెద్నెగోయను ముగ్గురు హెబ్రీ యువకులు ఇరాక్‌లో అగ్నిగుండములో పడవేయ బడిరి (దానియేలు 3వ అధ్యాయము). యేసుక్రీస్తు కూడ ఇరాక్‌లో వారితో నాల్గవవ్యక్తిగా యుండెను (దానియేలు 3:23).

14. బబులోను రాజైన బెల్షస్సరు రాజనగరు గోడమీద మానవ హస్తపు వ్రేళ్లు కనబడి ఏదోయొకటి వ్రాయం వ్రాయుచున్నట్లు చూచెను. అది ఇరాక్‌లో యుండెను (దానియే 5:5).

15. బబులోను రాజైన నెబుకద్నేజరు యూదులను ఇరాక్‌కు బందీలుగా కొనిపోయెను.

16. యెహెజ్కేలు ఇరాక్‌లో ప్రకటించెను.

17. పేతురు ఇరాక్‌లో సువార్త చాటెను.

18. ప్రకటన గ్రంథములో చెప్పబడిన బబులోను ఇరాక్‌లో ఒక పట్టణమై యుండెను.

మనము గమనించిన రీతిగా బైబిలులో ఇశ్రాయేలు జనాంగమును గూర్చి ఎక్కువ చెప్పబడెను. అయితే తదుపరి దేనిని గూర్చి చెప్పబడెనో తెలుసా? అది ఇరాక్‌ను గూర్చియే గాని బైబిలులో ఆపేరును బట్టి అది సంబోధింప బడలేదు. బైబిలులో అది బబులోను, షీనారు దేశము, మెసపొతొమియయని సంబోధింప బడెను. మెసపొతొమియ అనగా రెండు నదుల మధ్యనున్న ప్రదేశమని యర్థము. అది హిద్దెకెలు (టైగ్రిస్), యూఫ్రటీసు నదుల మధ్యనున్న దేశము (ఆది.కా. 2:14; దానియేలు 10:4). ఇరాక్ అనగా లోతైన వ్రేళ్లు గల దేశమని అర్థము.

నిజానికి ఇరాక్ చాలా లోతైనవేరులు (రూట్స్) గల దేశమే. ఇశ్రాయేలు తరువాత ఇరాక్‌ను గూర్చియే చరిత్రలోను ప్రవచనములలోను ఎక్కువ మనకగుపడును. ఇవి ఆలోచింపదగిన విషయములు!

# పెద్దల కుండవలసిన బైబిలు అర్హతలు

## ( Biblical Qualifications for Elders )

దేవుడు సంఘమును తగురీతిగా నిర్దేశించకుండా యుండలేదు. యేసు క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్నారు. దానికొరకు ఆయన తన ప్రాణమర్పించారు (ఎఫెసీ 5:23-25). దేవుని వాక్యము చొప్పున మనము జీవించాలి. దానినిబట్టియే మనకు తీర్పుతీర్చబడును (మత్తయి 28:18-20; లూకా 6:46; ప్రకటన 20:11-15). సంఘపెద్దలను క్రీస్తు ఆమోదించారు. ఏర్పరచబడిన సంఘమును నడిపించు బాధ్యత వారు కలిగియున్నారు. పెద్దలను కాపరులని, అధ్యక్షులని, పర్యవేక్షకులని బైబిలు పిలుచుచున్నది (పెద్దలు, పాస్టర్స్, ... అను పదములు వారికి వర్తిస్తాయి) (అపొ.కా. 20:28). పెద్దలకున్న బాధ్యత అత్యంత ప్రాధాన్యమైనది ఏలయనగా వారు యితరుల ఆత్మలను కాయువారైయున్నారు (హెబ్రీ 13:17). తత్ఫలితముగా పెద్దలుగా యుండగోరువారికి క్రొత్తనిబంధన కొన్ని అర్హతలనిచ్చుచున్నది. ఈ అర్హతలను వారు కలిగియుండవలెను (1తిమోతి 3:1-7; తీతు 1:5-9).

నిజానికి పెద్దల కుండవలసిన అర్హతలు ప్రతిక్రైస్తవ సోదరుడు, సోదరి కలిగియుండుటకు ప్రయత్నించాలి. పెద్దయైనవాడు "ఏకపత్నీపురుషుడై యుండవలెనన్నపుడు" అది స్త్రీలకు వర్తించదు గదా. మరియు అపొ.పౌలు వలె క్రైస్తవ సోదర, సోదరీలు అవివాహితులై యుండగోరవచ్చును. యివిగాక మిగతా అర్హతలన్నియు క్రైస్తవులైన ప్రతివారు కలిగియుండుటకు ప్రయత్నించాలి.

పెద్దలు (Elders) అను బైబిలు పదమును డినామినేషన్లవారు వివిధ రీతులుగా వాడుచున్నారు. ఒక డినామినేషన్ అయితే అవివాహితులైన యువకులను ఇంటింటికి ఇద్దరేసి చొప్పున పంపుచువారిని పెద్దలు (Elders) అని పిలుచుదురు. అయితే బైబిలు ప్రకారము పెద్దలు వివాహితులు, ఏకపత్నీపురుషులు! మరొక డినామినేషన్ అయితే అవివాహితులైన పురుషులను ఒక్కోపరియాకు బిషప్పులుగా నియమింతురు. బైబిలు ప్రకారమైతే బిషప్పులు (అనగా పెద్దలు) ఒకే స్థానిక

సంఘమునకు పర్యవేక్షకులు, ఒక ఏరియాకు కాదు! అన్ని డినామినేషన్లు తమ బోధకుని పాస్టర్ అని పిలుచుటకద్దు. అయితే క్రొత్తనిబంధన బోధకులను అట్లు పరిగణించుటలేదు. పాస్టర్ అన్నా, ఎల్డర్ అన్నా క్రొత్తనిబంధన ప్రకారము ఒక్కటే. సరిగదా ప్రతిస్థానిక సంఘములోను ఒక్కడే పాస్టర్‌గాక (పెద్దగాక) ఇద్దరు లేక అంతకంటె ఎక్కువమంది పెద్దలు (పాస్టర్లు) ఉందురు. మతశాఖల పద్ధతులను అనుసరింపక ఈ పదముల యొక్క సరియైన భావార్ధము కొరకు మనము క్రొత్తనిబంధననుసరించాలి.

పెద్దలను గూర్చి చెప్పునప్పుడు క్రొత్తనిబంధన వివిధపదముల నుపయోగించుచున్నది. Elders (పెద్దలు) అను పదముగ్రీకులో Presbuteros అను పదముగా యున్నది. అయితే 1తిమోతి 4:14లో Presbytery (పెద్దలు) అని చెప్పబడియున్నది. పెద్ద యనగా సాధారణంగా వయసులో పెద్దవాడని తలంచుదుము. అది అనుభవాన్ని, గౌరవాన్ని, పరిపక్వతను సూచించు చున్నది. యూదామతములో అధికారులను, న్యాయాధిపతులను వయసును మీరినవారిలో నుండి ఎంచుకొనేవారు. దీనికి పెద్దలు అనే పదమునకు సంబంధమున్నది. పెద్దలు లేక పెద్ద అను పదము క్రొత్తనిబంధనలో 69సార్లు కనబడును. 19సార్లు సంఘ పెద్దలను గూర్చి, 34సార్లు పరలోక పెద్దలనుగూర్చి, 4సార్లు వయస్సును గూర్చి, 12సార్లు పరలోకపెద్దలను గూర్చి ప్రకటన గ్రంధములో చెప్పబడి యున్నది. ఉదాహరణకు అపొ.కా. 11:30;1 4:23; 15:2,4,6,22,23; 16:4;20:17;21:18;1తిమోతి 5:17,19; తీతు 1:5; యాకోబు 5:14లో చూడండి. బిషప్పులు, ఓవర్సీర్లు అను పదములు Episcopos అను పదమునుండి తర్జుమా చేయబడినవి. దీనికి పరీక్షించువాడు, పర్యవేక్షించువాడు, కనిపెట్టువాడు, సంరక్షకుడు, పనులను సక్రమముగా నడిపించే బాధ్యతగలవాడను భావములు అందున్నవి. పెద్దల యొక్క పనిని గ్రీకు మాట చక్కగా వర్ణించు చున్నది. Episcopos అనుపదము ఇంగ్లీషులో Bishop అని తెలుగులో అధ్యక్షుడని తర్జుమా చేయబడినది (1 తిమోతి 7:1,2; తీతు 1:7; ఫిలిప్పీ 1:1). 1పేతురు 2:25లో అది యేసు క్రీస్తుకు

వర్తింపజేయబడినది. Overseer అనగా సంఘమునకు కాపు కాయువాడను భావము. అపొ.కా. 20:28లో చెప్పబడియున్నది.

Pastors, Shepherds (పాస్టర్స్, షెపర్డ్స్) అను పదములు గ్రీకులో Poiman అను పదము నుండి తర్జుమా చేయబడినవి. ఈ మాటలో నున్నిత సంరక్షణ, కాపుదల దాగియున్నవి. కాపరి (Pastor) అనుపదము గొర్రెలను కాయు వానిని సాధారణముగా సూచించును (లూకా :8). ఎఫెసీ 4:11లో Poiman అను పదము సంఘ కాపరులకు వర్తింపజేయబడినది. యేసుక్రీస్తు ప్రధానకాపరిగా వర్ణింప జేయబడినది (మత్తయి 25:32; యోహాను 10:11,14,16; హెబ్రీ 13:20). యేసుక్రీస్తు ప్రధాన కాపరియై యుండగా ప్రతిస్థానిక సంఘ కాపరులు ఆయన అధికారముచొప్పున పనిచేయబాధ్యత గలవారైయున్నారు (1పేతురు 2:25).

పెద్దలను గూర్చిన బైబిలు పదముల యొక్క అర్ధమును గ్రహించిన తరువాత, పెద్దలుగా నియమించబడబోవు వారి అర్హతలను గూర్చి బాగుగా మనము తెలిసికొన వలెను. ఆ అర్హతలు క్రొత్తనిబంధనలో రెండుచోట్ల మనకు అగుపడును. 1 తిమోతి 3:1-7లోను, తీతు 1:5-9 లోను అవి మనకగుపడును. పెద్దల యొక్క అర్హతలను ఆరుభాగములుగా మనము సహజముగా విభజింప వచ్చును. అవి వారి అనుభవము, వారి శీలము లేక జనాభిప్రాయము, గృహసంబంధము, ప్రవర్తన, అలవాట్లు వారిని గూర్చిన ఉపదేశించుటకు పాలించుటకు గల సామర్ధ్యము అనునవి.

ఎవడైనను అధ్యక్ష పదవిని ఆశించిన యెడల అట్టివాడు దొడ్డ పనిని అపేక్షించుచున్నాడు : **(1తిమో 3:1).**

పెద్దలయొక్క అర్హతలకు ముందుగా పెద్దగా యుండువాడు అట్లుండుటకు ఇష్టపూర్వకముగా ఆశించాలి, బలవంతముగా కాదు, గాని స్వేచ్ఛాపూర్వకముగా ఆ పనిని అతడు కాంక్షించాలి (1పేతురు 5:2). బలవంతముగా పెద్దలనేర్పాటు చేసి వారు ఆ పనిలో కొనసాగునట్లు వారు బలవంతము చేయబడకూడదు. సంఘ సభ్యులపై అధికారము చెలాయించుటకు కోరుకొనేవాడు పెద్దగా యుండుటకు

అర్హుడుకాదు. పెద్దగా యుండాలనే ఆశ ప్రభువు సంఘమునకు సేవచేయాలనే ప్రేమ పూర్వకకాంక్షయై యుండవలెను.

పెద్దగా యుండుట సేవచేయు స్థావరమే తప్ప వేరొకటికాదు. అది క్రీస్తుసంఘముకు పరిచర్యచేయు అవకాశవే తప్ప అధికారము చెలాయించుస్థావరము కాదు.

**అధ్యక్షుడగువాడు...(1తిమో3:2) :**

అధ్యక్షునిగా లేక పెద్దగా ఏర్పాటుచేయబడువాడు వాక్యములో చెప్పబడిన అర్హతలను తప్పక కలిగి యుండవలెను. పెద్దగా ఏర్పాటు చేయబడుసరికి వానికి ఆ అర్హతలుండ వలెను. పెద్దగా నియమించబడిన తరువాత అతడు పాపములో బడితే అతడు వెంటనే అనర్హుడగును. ఇది విదితమే. అయితే దేవుడు కోరిన కొన్ని అర్హతలు పెద్దగాయున్నవాడు మధ్యలో కోల్పోవచ్చును. ఉదాహరణకు అతని పిల్లలు పెద్దవారై, వివాహితులుగానో. ఉద్యోగమువలననో అతని గృహము నుండి వేరుపడవచ్చును. అయినను పెద్దగా యున్నవాడు తన యింటిని బాగుగా ఏలినవాడనే అర్హతను కోల్పోడు. మరల ఒక పెద్ద యొక్క భార్యమృతిజెందితే, వైవాహిక జీవితానుభవమును అతడు కోల్పోవునా?

**నిందారహితుడు : (1తిమోతి 3:2; తీతు 1:6).**

నిందారహితుడనగా ఏ విధమైన నిందలేనివాడని యర్థము. నిందింపతగినవాడుకాదు. అయితే నిందారహితుడనగా అతడు పరిపూర్ణుడని యర్థముకాదు. మానవ దృక్కోణములో పెద్దలు పరిపూర్ణులుగా అగుపడవచ్చును. యితరులతో పోల్చినపుడు వారు పరిపూర్ణులుగా అగుపడుదురు గాని వారు పాపములేని వారుకారు. నిందారహితుడనగా బహిరంగముగా నిందింపతగిన వాడు కాదు, సంఘములోను సమాజము లోను అతడు మంచిపౌరుడు. పనిలో పెద్దలు నమ్మకత్వము, యధార్థత నీతి నియములు కనుబరచువారై యున్నారు.

**ఏకపత్నీపురుషుడు (1తిమోతి 3:2; తీతు 1:6).**

దేవతార్చన చేయువారు, ఇశ్రాయేలీయులు కూడ కొంత మట్టుకు బహుభార్యత్వమును అనుసరించి యుండిరి (1సమూ1:2,

2సమూ 3:2-5;5-13). అయితే ఒకరికంటె ఎక్కువమంది భార్యలను కలిగియుండు మనుష్యుడు పెద్దగా యుండుటకు అనర్హుడని అపొ.పౌలు తిమోతికి తెలియజేసాడు. ఏకపత్నీ పురుషుడునుసరికి ఆ సమయమునకు ఒకే భార్యను కలిగియున్నవాడని యర్ధము. అనగా వివాహితుడై పలువురినిగాక ఒకే భార్యను కలిగి యున్నవాడు. అలాగే అవివాహితుడు, బ్రహ్మచారియైనవాడు పెద్దగా యుండతగడు ఏలయనగా తదుపరి అర్హతలలో అతడు తనపిల్లలను స్వాధీన పరచుకొనడం, తనయింటివారిని బాగుగా ఏలడంచెప్పబడియున్నది. సంఘపెద్దయైనవాడు ఒకే స్త్రీ యొక్క పురుషుడు, ఒకే స్త్రీకి వివాహితుడైన వాడు. ఏకపత్నీపురుషుడు.

సంఘపెద్ద యొక్క భార్య మరణిస్తే అతడు ఆటోమేటిక్‌గా అనర్హుడగునా? 'అవును' అనికొందరు సహోదరులందరు, తన భార్య చనిపోగానే పెద్దయైనవాడు ఆ పని నుండి విరమించుకొన వచ్చును. అయితే క్రొత్తనిబంధన అట్లు చెప్పు చున్నదా? సంసార జీవితానుభవమును బట్టి పెద్దగా అతడు నియమింపబడి యుండగా ఆయనుభవమును భార్య మరణించగా అతడుకోల్పోవునా?

మరొక ప్రశ్నయేమంటే, భార్య మరణిస్తే సంఘపెద్దయేమిచేయాలి? సంఘపెద్దల బాధ్యత నుండి అతడు విరమించుకొనవలెనా? మరుసటి ఆదివారమే ఆపనికి అతడు రాజీనామా చేయవలెనా? అవుననికొందరు చెప్పుదురు. అయితే నేను ఆసంఖ్యలో లేను. అతడు నియమింపబడినప్పుడు ఏకపత్నీ పురుషుడే, గాని భార్య చనిపోగానే అతడు రాజీనామా చేయాలని లేఖనములు చెప్పుట లేదు. గాని అతడు రాజీనామా చేయుటకు నిశ్చయించుకొంటే అది అతని అభీష్టము. గాని భార్య చనిపోయినను కుటుంబపరమైన సంసారానుభవమును అతడు ఇంకా కలిగియేయున్నాడు. ఆయనుభవమును బట్టి మిగతా పెద్దలతో కలసి సంఘమును విజయవంతముగా నడిపించగలడు.

ఇంకొక సందర్భము : విశ్వాసులైన పిల్లలు గలవాడుగా యున్నప్పుడు పెద్దలలో ఒకనిగా ఒకడు నియమింపబడిన తరువాత ఆ పిల్లలను రోగము వలననో, ప్రమాదములోనో అతడు పోగొట్టు కొంటే? నిన్నటివరకు అతడాపిల్లలను కలిగియున్నాడు,

ఈనాడు వారతనికి లేరు. అట్లయినప్పుడుతడు పెద్దగా యుండి పరిచర్యచేయుటకు అనర్హుడా? కానేకాదు! పెద్దగా నియమింపబడినప్పుడు విధేయులైన పిల్లలు తనకుండిరి. ఆ అర్హతను అతడు కలిగి యుండెను. ఆ పిల్లలు మరణించుట వలన అతని అనుభవమును, అర్హతను కోల్పోడు.

భార్య చనిపోగా మరలా వివాహము చేసికొనినవాడు లేదా భార్య యొక్క వ్యభిచార కారణమును బట్టి విడాకులు తీసికొని మరల వివాహితుడైన వాడు పెద్దగా నియమింపబడుట సాధ్యమే (మత్తయి 19:9; 1కొరింథి 7:15). దేవుడు నిర్దోషత్వమును చాటగా దానిని మనం అతనికి విరోధముగా వాడకూడదు.

అతని భార్యచనిపోగా మరల పెండ్లిచేసుకొన్నాడు. ఈ నియమము తన క్రొత్త భార్యయెడల అతనికి వర్తించును. ఆమె మాత్రమే అతని జీవితంలోయున్న ఒకే ఒక స్త్రీ. చనిపోయిన స్త్రీ యిక అతని భార్యకాదు. "భార్య తన భర్త బ్రదికి యున్నంత కాలము బద్ధురాలై యుండును, భర్త మృతి పొందిన యెడల ఆమె ఇష్టమైన వానిని పెండ్లి చేసికొనుటకు స్వతంత్రురాలై యుండును గాని ప్రభువు నందు మాత్రమే పెండ్లి చేసుకొనవలెను" (1 కొరింథి 7:39). "భర్త గల స్త్రీ భర్త బ్రదికి యున్నంత వరకే ధర్మశాస్త్రము వలన అతనికి బద్ధురాలు గాని భర్త చనిపోయిన యెడల భర్తవిషయమైన ధర్మశాస్త్రము నుండి ఆమె విడుదల పొందును'' (రోమా 7:2). పునరుత్థానము నందు విశ్వసించని సద్దూకయ్యులకు యేసు జవాబిచ్చిన సందర్భములో మరణించిన తరువాత భార్యభర్తల సంబంధము యిక వుండదు అనే భావము ఇడిమి యున్నది (మత్తయి 22:23-30). ఒక మనుష్యని భార్య చనిపోగా, వారి బంధము యిక వుండదు. వారికమీదట భార్యభర్తలు కాదు. యిది యదార్థము కాకపోతే పునర్వివాహము అనుమతించబడకపోవును. భార్య గాని భర్త గాని మృతులైన తన జీవనసాటితో బంధింపబడివుండరు. గనుక వారు మరల పెండ్లి చేసికొందురు. అట్టి సందర్భములో ఒకే స్త్రీకి భర్తగాను, ఒకే పురుషునికి భార్యగాను వారుందరు. భార్య చనిపోయిన పురుషుడు లేఖనముల

ప్రకారము యోగ్యమైన స్త్రీని వివాహమాడితే, అట్టివాడు పెద్దగా యుండతగును. వాక్యప్రకారము విడాకులు యిచ్చి పునర్వివాహితుడైన పురుషుని యెడల కూడ యిది వర్తించును. అతడు పెద్దగా యుండ నర్హతగలవాడగును.

ఇంకా పైన చెప్పబడిన వారిలో ఎవరినైనా పెద్దగా ఎంచుకో వచ్చునో లేదో నిర్ణయించుకొను స్వాతంత్ర్యము అతని స్థానిక సంఘము కలిగి యుండును.

ఒకని భార్య చనిపోయినందు నను లేదా ఆమె అతనికి అపనమ్మకము గా యున్నందునను అతడు మరల వివాహమాడినందున అతడు పెద్దగా యుండఅనర్హుడని దీనియర్థముకాదు. మిగతా లేఖనార్థమైన అర్హతలు అతనికి లేకపోతే అట్టివాడు పెద్దలలో యుండతగడు. మరల అతనికి మిగతా అర్హతలున్నను, పునర్వివాహితుడై నందున స్థానిక సంఘము అతని పెద్దగా అంగీకరించకపోతే, అతడాస్థానమును కోరుకొనకూడదు. లేఖనములు విధించు అర్హతలుగల పురుషులు మాత్రమే పెద్దలుగా నియమింపబడవలెను, స్థానిక సంఘము వారిని తమ నాయకులుగా ఎంచతగును.

**దేవుని గృహనిర్వాహకుడు (తీతు 1:7) :**

గృహనిర్వాహకుడు ( Steward) తనయజమాని యొక్క మేనేజరు లేదా వేరొకని ఖజానాదారుడు. అతడొక ఉద్యోగస్థుడు. పెద్దలు యేసుక్రీస్తు యొక్క పనివారు (1పేతురు 5:1-4). ముఖ్యముగా పెద్దలు ప్రభువు యొక్క రెండు ఖజనాలకు బాధ్యులు. "వారు దేవుని మర్మము" విషయములో గృహనిర్వాహకులు (1కొరింధీ 4:1). 2) వారు పెద్దలుగా యున్న స్థానిక సంఘ ఆత్మలను కాయువారు (హెబ్రీ 13 : 7, 17). ముఖ్యముగా పెద్దల యొక్క పరిచర్య ఆత్మీయవిషయములలోనే యుండును. అయినను సంఘము యొక్క భౌతిక పరమైన విషయము లలో కూడవారు బాధ్యులు (ఉదా: సంఘము యొక్క స్థలము, ఆస్థి, ఆర్థికస్థితి మొదలగునవి). అంతేగాకుండా పైకగుపడని విషయములను కూడ వారు మేనేజ్ చేయుదురు. ఉదాహరణకు పరిసర ప్రాంతములలోను,దూరప్రాంతములలోను సువార్త బోధించు తరుణములను వారు

వెదుకుదురు, ఉపయోగించుదురు. స్థానిక సంఘము, దానికి సంబంధించిన వ్యవహారములన్నియు పెద్దల యొక్క పర్యవేక్షణలో కొనసాగును. వారు దేవుని గృహ నిర్వాహకులు.

**మితానుభవుడు ( Temperate) (1 తిమోతి 3:2):**

మితానుభవుడనగా విపరీత ధోరణి గలవాడు కాదు. పెద్దయైన వాడు తన స్వకీయ జీవితముపై సరియైన నిగ్రహము గలవాడు. అతడు తన ఆలోచనలను, సంభాషణను, ప్రవర్తనను, దైనందినచర్యలను అదుపులో యుంచుకొనలేకపోతే, యితరుల జీవితములనెట్లు అదుపులో యుంచగలడు? యితరుల జీవిత విధానములో ఎట్లు సహాయం పడగలడు? నిగ్రహశక్తి, బుద్ధి లేనివాడు యితరులకు వాటిని ప్రసాదించలేడు.

**స్వస్థబుద్ధిగలవాడు (1 తిమో 3:2) :**

స్వస్థబుద్ధియనగా నిగ్రహబుద్ధి, వివేచించు మనస్సుయని చెప్పుకొన వచ్చును. పెద్దయైనవాడు నిష్పక్షపాతి, సరళమనస్సు గలవాడు. అతడు క్షణికావేశమునకు గురికాకూడదు. పెద్దయైనవాడు చిలిపిచేష్టలకు, వేళాకోళములకు లోనుకాకూడదు. దీనినిబట్టి అతడు హాస్యము నుపయోగించకూడదని యర్ధము కాదు. అయితే నిశితముగా ఆలోచించని వాడెన్నడు పెద్దగా నియమించబడకూడదు. దేవుని గృహము యొక్క నిర్వాహకత్వము తీవ్రమైన పనియైయున్నది. పెద్దయైన వాడు సమతుల్యుడు. అతడు ఆరోగ్య కరమైన సమతుల మనస్సుకలిగి, లోక జ్ఞానమును సమృద్ధిగా కలిగిన వాడై యుండవలెను.

**మర్యాదస్థుడు (1తిమో 3:2) :**

మర్యాదస్థుడు అనగా క్రమ బద్ధుడు అనియర్ధము. పెద్దయైన వాని జీవితం మర్యాదపూర్వకముగా యుండ వలెను. అతడు తన పనిలో సోమరి కాకూడదు. అజాగ్రత్తపరుడు కాకూడదు మరియు గజిబిజిగా యుండకూడదు. కొన్ని సంఘముల యొక్క పనిలో క్రమముయేమీవుండదు.

**అతిథిప్రియుడు (1తిమో 3:2; తీతు 1:8) :**

అతిథిప్రియుడు అనుపదము సహోదర ప్రేమ అనే పదము నుండి వచ్చినది. ఆతిథ్యమనగా క్రొత్తవారి యెడల ప్రేమ కలిగి వారియెడల

ఉదారముగా ప్రవర్తించుట. యితరుల యెడల మన ప్రవర్తన యెట్లుండాలో క్రైస్తవ్యము తెలియజేయు ప్రేమ అది. మన పెదవులపై ఎల్లవేళలా ఇతరుల యెడల ఉండవలసిన ప్రేమ అది. పెద్దయైన వాని గృహము అతిధి సత్కారమునకు నిలయమై యుండ వలెను. ఆతిధ్యమిచ్చుటలో పెద్ద యొక్క భార్య కూడ ఉదారస్వభావియై అతిధులను సత్కరించునదైయుండ వలెను. తన భర్త యొక్క పని విజయవంత మవుటకు భార్య కీలకమైనది.

**బోధింప తగినవాడు (1 తిమోతి 3:2; తీతు 1:9) :**

"బోధింవతగినవాడు", "ఎదురాడు వారి మాటలన ఖండించుట కును శక్తిగలవాడు" అనగా బహిరంగ ముగా బోధింపతగినవాడని యర్ధము. సంఘ పెద్దలుగా నియమింపబడబోవు వారు దేవుని వాక్యమును ధైర్యముగా బోధించువారై, ఎదురాడు వారికి తగురీతిగా జవాబిచ్చు వారై యుండ వలెను. పెద్దయైన ప్రతివాడు దేవుని ధర్మశాస్త్రమును ఇష్టపూర్వకముగా బోధించువాడై యుండవలెను (2 తిమో 3:2). అతడు బహిరంగముగాను, ఇంటింటికిని బోధింపతగినవాడై యుండ వలెను. అతడు బోధించుటలో నేర్పరియై యుండవలెను. అనగా అతడు వాక్యజ్ఞానమును సమృద్ధిగా కలిగిన వాడైయుండవలెను. కొందరి యెదుట నిలబడి వాక్యమును బోధింపశక్తి లేనివాడు పెద్దగా యుండ తగడు. సత్యవాక్యమును బోధింప లేనివాడు సత్యమును గ్రహించలేడు, అతస్యమును ఖండించలేడు, పెద్దగా నుండ తగనివాడు.

**మద్యపానికాకూడదు (1 తిమో 3:3; తీతు 1:8) :**

అతడు మద్యమును సేవించు వాడు కాకూడదు. మద్యము సేవించు వాడవడైనను దేవుని సంఘములో పెద్దగా నుండుటకు అనర్హుడు. మద్యమును ఏరీతిగా సేవించుట యైనను సంఘపెద్దగా యుండుట యైనను ఒకనిదానికొకటి పొసగనవి. సరదా కొరకైనను త్రాగు వానికి పెద్దలలో స్థానముండదు.

**కొట్టువాడు కాకూడదు (1తిమో 3:3; తీతు 1:7) :**

అతడు హింస కోరుకొనకూడదు. జగడమాడని వాడు. ఈ రెండు మాటలు ఒకే గ్రీకు పదము నుండి ఉద్భవించినవి. అతడు

పోట్లాడువాడు, కొట్టువాడు కాకూడదు. అతనికి ఎదురాడినా, అయిష్టముగా యున్నా అట్టివారి మీదికి కొట్టడానికి పోకూడదు. కొందరు వాదనలు పెట్టుకొందురు, మరికొందరు అనవసరమైన కొట్లాటకు దిగుదురు. ముక్కోపి, జగడమాడువాడు, కొట్లాటకు దిగువాడు పెద్దగా యుండకూడదని దేవుని వాక్యము పదే పదే హెచ్చరించుచున్నది.

**ధనాపేక్షలేనివాడు (1తిమో 3:3; తీతు 1:7) :**

ధనాపేక్షలేనివాడు అనగా ధనానికే అంకితమైనవాడు కాదని యర్థము. అది అతని జీవితధ్యేయము కాకూడదు. "ఎందుకనగా ధనాపేక్ష సమస్తకీడులకు మూలము" (1తిమో 6:10). మనుష్యుడు దేవునిని సిరిని కూడ ఒకేసారి సేవించలేడని యేసు ప్రభువు చెప్పారు. "మీరు దేవునికిని సిరికిని దాసులుగా యుండనేరరు" (మత్తయి 6:24).

**సాత్వికుడు (1 తిమో 3:3) :**

మృదుస్వభావము గలవాడు, సరళప్రవర్తన గలవాడు. సంఘములో ప్రతిసభ్యుడు అతని కలసికోడానికి అనుకూలమైనవాడు. అతడు విన నొల్లని వాడు కాకూడదు. శాంత వర్తనుడై యున్నాడు. సభ్యుల విన్నపములు లేక సలహాలను ఓపికతో వినువాడైయుండవలెను.

**దుర్లాభమునపేక్షించు వాడు కాకూడదు : (తీతు 1:7)**

అతడు ధనమును ప్రేమింప రాదు. పెద్దయైనవాడు సంపద కొరకు ప్రాకులాడకూడదు. క్రీస్తుపరిచర్యలో వ్యాపారలావాదేవీలను సయితము ప్రక్కనపెట్టువాడై యుండవలెను. ధనార్జన కొరకు పెద్దయైనవాడు అక్రమ వ్యాపారమును చేయరాదు. సంఘపెద్దలు ధనము విషయమై సరియైన స్వభావము కలిగియుండ వలెను.

**క్రొత్తగా చేరినవాడై యుండ కూడదు (1తిమోతి 3:7) :**

అనగా అనుభవము యేమి లేని వాడు కాకూడదు. ఇంకొకమాటలో అతడు అనుభవము కలిగి, వయస్సులో పెద్దవాడైనవాడు. క్రొత్తగా క్రీస్తులోనికి మార్పుజెందినవాడు కాదు. పెద్దగా యుండబోవువాడు క్రైస్తవానుభవములో

పరీక్షింపబడినవాడు. ప్రభువు పరిచర్యలో అనుభవము గలవాడు.

**వెలుపటివారి చేత మంచి సాక్ష్యము పొందినవాడు (1తిమో 3:7) :**

అనగా క్రైస్తవేతరులు సయితము అతని గౌరవించువాడు. ఒకని గతపాపముల వలన సంఘము లోని వారు, వెలుపల యున్నవారు కూడ అతని గౌరవించ లేకపోతే, అట్టివాడు పెద్దగా యుండ రాదు. అతని గతపాపములను దేవుడు మానవుడు కూడ క్షమించి యుండ వచ్చును గాని అతని గతము యొక్క పర్యవసాన ఫలితముగా తాను చేయగలిగినంత పని సంఘపెద్దగా చేయలేడు. అట్టి మనుష్యుని సంఘ పెద్దగా స్థానిక సంఘము అంగీకరించక పోతే, అట్టివాడు పెద్దకాకూడదు. ఒకని ప్రవర్తనను బయటి వారు సయితము ప్రశ్నించు నట్టిదైతే అట్టివాడెన్నడు పెద్దగా నియమింపబడరాదు. ఒక పట్టణస్థులు లేక గ్రామస్థులు ఆ మనుష్యుని యందు నమ్మకములేకపోతే అట్టివాడు ఆ ప్రజలను క్రీస్తులోనికి ఎట్లు మార్చగలడు? ఆ సమాజము సువార్తను ఎదురాడవచ్చును. గాని ఆ గ్రామస్థులు స్థానికసంఘమును గూర్చి సదభిప్రాయము కలిగియుండవలెను. అయితే ఒకని గతాన్ని గూర్చి ఇటులోపలి వారికి అటు బయట వారికి అభ్యంతరము లేకపోతే, అర్హతలు గలవాడైతే అట్టివాడు సంఘపెద్దగా నియమింపబడవచ్చును.

అపొ. పౌలు క్రైస్తవులను ఘోరముగా హింసించాడు. అయినను క్రీస్తుకు అసమాన పరిచర్యచేసాడు. అతడు ఏయేప్రాంతములలో క్రైస్తవులను హింసించలేదో అక్కడ క్రీస్తు కొరకు ఎక్కువ విజయాన్ని సాధించాడు. క్రొత్తనిబంధనలో అతడు వ్రాసిన పత్రికలసంఖ్య మిగతావారి కన్నా చాలా ఎక్కువ. ఇంచుమించు 14 పత్రికలు అతడు వ్రాసాడు. అపొ. పేతురు యేసును ఎరుగనని బొంకాడు గాని చాలా విలువైన క్రీస్తు సేవకుడ య్యాడు. అతడు యూదులకు, అన్యులకూడ మొట్ట మొదటి సువార్త ప్రసంగాన్ని చేసాడు. అతడు క్రొత్త నిబంధనలో రెండుపత్రికలు వ్రాసాడు. పేతురు అపొస్తులుడు మాత్రమేగాక ఒక స్థానికసంఘములో పెద్దలలో ఒకడై యుండెను (1పేతురు 5:1).

– లూయిస్ రష్‌మోర్

(మిగతా భాగం వచ్చే సంచికలో)

(2వ పేజీ తరువాయి - సంక్షిప్త వార్తలు)

బైబిలు తరగతులలో 1 తిమోతి, 2వ తిమోతి, తీతుపత్రికలు సవిస్తరముగా బోధించిరి. ఆంధ్ర, తెలంగాణ, ఒరిస్సా ప్రాంతముల నుండి వచ్చిన వారు గొప్ప ఉపదేశములునాలకించిరి. 15వ తేదీనాడు మార్క్‌రేనాల్డ్ గారు మరొక 5గురు కలసి కాకినాడ చేరుకొని పరిచర్యలో పాలుపొందిరి.

2017 జూలై 20,21, 22 తేదీలలో భీమవరం మెంటే వారితోటలో యున్న క్రీస్తు సంఘము తమ 23వ వార్షికోత్సవ సందర్భముగా సువార్త కూటములు నిర్వహించిరి. ఆ కూటములలో యం. దేవానంద్ (తాడేపల్లి గూడెం), వెంపాటి సంజయ్ (అరకు), మార్క్‌రేనాల్డ్ (అమెరికా), జాషువా గూటం, ఆర్.కె.చింతపల్లి (ఒంగోలు), పి.డి.బిషప్ (మండపేట) గార్లు వాక్య పరిచర్యచేసిరి. హాజరైనవారందరికి ప్రతిరోజు స్థానిక సంఘము చక్కటి భోజనములునేర్పాటుచేసిరి. మార్క్‌రేనాల్డ్ గారు, జాషువాగారి రాకతో సభ్యులలో గొప్ప ఉత్సాహము, ప్రేమ, సహవాసములు పురికొల్పబడెను. మెంటే వారి పేటలోను, మైపాలోను సోదరులు కొండేటి హానోకు గారును, వారి కుమారులు కొండేటి టైటస్ గారును గొప్ప పనిచేయుచున్నారు. ఒక ఆదర్శవంతమైన సంఘముగా మెంటేవారి పేటలోని క్రీస్తుసంఘమును వారు తీర్చిదిద్దుతున్నారు.

రిక్కీ గారితోయున్న అమెరికా యువకబృందము, మార్క్‌రేనాల్డ్ గారును 24వ తేదీ రాత్రి గంగ్రేడులో జరిగిన సువార్త కూటములో పాల్గొని వాక్యపరిచర్యచేసిరి. అక్కడ యస్.జాన్ గారు అనేక సంవత్సరములుగా వాక్య పరిచర్యచేయుచున్నారు. ఆ రోజు మధ్యాహ్నం తుని దగ్గరనున్న తిమ్మాపురం గ్రామములో జరిగిన సువార్త కూటములో మార్క్ గారు, రిక్కీ గారు వాక్య పరిచర్యచేయగా ఇద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మముపొందిరి. అక్కడ సోదరులు అబ్రహాము గారు చాలా కాలముగా గొప్ప పని చేయుచున్నారు.

2017 జూలై 27వ తేదీ శుక్రవారం అమలాపురంలో సోదరులు దొగ్గా ఇశ్రాయేలు రాజు (కొండుకుదురు) గారి కుమార్తెకు జరిగిన వివాహ

కార్యక్రమములో పై నుదహరించిన అమెరికా యువకబృందము, జాషువా గారు, రిక్కీగూటం, రోనీగూటం గార్లు హాజరై వధూవరులను ఆశీర్వదించిరి. 26వ తేదీన రాబిన్ గూటం గారు, జెస్సీబేల్‌గారు, మరొక అమెరికా సహోదరి కలసి విశాఖపట్టణం, కలకత్తా మీదుగా అస్సాంకు వెళ్లి, తదుపరి భూటాన్ సరిహద్దులలో పర్యటించి, పరిచర్యచేసి 29వ తేదీ రాత్రి కాకినాడ క్షేమముగా చేరుకొనిరి. గత 5, 6 వారములలో రిక్కీ గారి ద్వారా జరిగించబడిన సువార్త కూటములలో 93 మంది క్రీస్తులోనికి బాప్తిస్మముపొందిరి. అమెరికా నుండి వచ్చిన యువక బృందము 30వ తేదీ రాత్రి బయలుదేరి హైదరాబాద్ మీదుగా అమెరికా వెళ్ళుటకు పయనించిరి.

మీ చేతిలోయున్న ఈ సంచికతో సత్యవాక్కు 39వ సంవత్సరములో ప్రవేశించినది. ప్రతినెలా 12 వేల మందికి యిది చేర్చబడుచున్నది. ఇంతవరకు నడిపించిన మహాదేవునికి స్తోత్రములు.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.